క్లుప్తంగా

క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులను సత్కరిస్తున్న కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్ : క్రీడాకారులకు హోప్ ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహం అందజేస్తామని ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ పేర్కొన్నారు. బుధవారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నగరంలో శేషాద్రినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన 2వ జాతీయ కరాటే అండర్ కుంగ్‌ఫూ 2023 చాంపియన్ షిప్ పోటీలలో చందానగర్ పీజేఆర్ స్టేడియంకు చెందిన పూజిత బంగారు పతకంతో పాటు చాంపియన్ షిప్ సాధించగా, ప్రదీప్ 2 బంగారు, సాయి రాఘవ్ 1 కాంస్యం, వరుణ్ బంగారు, రిషిత నట్టేశ్వర్, హరీష్, శివలు పలు విభాగాలలో పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు హోప్ ఫౌండేషన్ ద్వారా రూ.5వేల నగదును కోచ్ లక్ష్మణ్‌కు అందజేసి సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బచ్చుగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం అమరేందర్ రెడ్డి మెడ్వాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మెడ్వాన్ సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ రత్నం, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ మహజీబ్ తదితరులు పాల్గొన్నారు.

28న 'ఎస్కీ'లో కెరియర్ గైడెన్స్ ఫెయిర్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గ్రాడ్యుయేట్స్ కోసం కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ ప్రోగ్రామ్–2023ను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. ఎస్కీలోని చాణక్య సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ



శిక్షణా కేంద్రంను ప్రారంభించిన కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురం కాలనీలో ఖార్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రాన్ని బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాదితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు తాము నిలబడి పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. పరిసర ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంజుల మల్లాది, సిబ్బంది లక్ష్మణ్, నవీన, సీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప, నైవేద్యాలకు 8 దేవాలయాలు ఎంపిక



అర్చకులకు అనుమతి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: దేవాలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని దేవాలయాలను ఎంపిక చేసి అర్చకులకు పదివేల రూపాయలను అందిస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్, బాలానగర్‌లకు చెందిన 8 దేవాలయాలు ఎంపికయ్యాయి. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అర్చకులకు ఇందుకు సంబంధించిన అనుమతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో నిత్యం ధూపదీ నైవేద్యాలకు నగదు అందజేయటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్లపైనే డంప్..

ఇష్టానుసారంగా నిర్మాణ వ్యర్థాల పారబోత



గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ రోడ్డు వెంట ఉన్న నాలాలో నిర్మాణ వ్యర్థాలు డంప్ చేసిన దృశ్యం

గచ్చిబౌలి: రోడ్ల వెంట భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. ఐటీ కారిడార్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా కనపడుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్మాణ రంగం జోరు మీద ఉండటంతో వ్యర్థాలు అదే స్థాయిలో వస్తున్నాయి. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ వ్యర్థాల తొలగింపునకు గతంలో టోల్‌ఫ్రీ నంబరు ప్రవేశపెట్టింది. అవగాహన సదస్సులను సైతం నిర్వహించింది. కానీ వ్యర్థాల డంప్ మాత్రం ఆగడం లేదు. శేరిలింగంపల్లి సర్కిల్–21 పరిధిలోని బ్రహ్మకుమారీస్ రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తున్నారు. ఇక్కడ నిర్వహించే మెడిటేషన్ వర్క్‌షాపులకు మంత్రులు, వివిధ దేశాల నుంచి వీఐపీలు వస్తుంటారు. డంపింగ్‌తో రోడ్లు కళావిహీనంగా తయారయ్యాయి. వ్యర్థాలతో ఈ ప్రాంతంలో వరద నీరు వెళ్లే నాలా పూడిపోయింది. వానొస్తే నీరు రోడ్డుపైనే ఉంటోంది. నిఘా లేకపోవడంతో రోడ్లు, చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలను పారబోయడం పరిపాటిగా మారింది. వ్యర్థాల అక్రమ డంప్‌కు అడ్డుకట్ట వేస్తేనే క్లీన్ సిటీగా మారుతుంది.

గతంలో ఇలా....

గతంలో నిర్మాణ వ్యర్థాల డంప్‌పై ప్రత్యేక నిఘా ఉండేది. జీహెచ్‌ఎంసీకి చెందిన ఓ ఉద్యోగి సైబరాబాద్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్‌లో పని చేసే వారు. నిర్మాణ వ్యర్థాలతో వెళ్లే వాహనాలను సీసీ పుటేజీలలో పరిశీలించి ఆ వాహనం ఎక్కడ డంప్ చేస్తుందో చూసి ఆ పుటేజీని వాహనదారునికి పంపి భారీ జరిమానా విధించేవారు. అయినా వారిలో మార్పు రాకుంటే పీఎస్‌లో ఫిర్యాదు చేసేవారు. ప్రస్తుతం నిఘా కొరవడంతో కొందరు టిప్పర్ల యజమానులు నిర్మాణ వ్యర్థాల తరలింపును కాంట్రాక్ట్ తీసుకొని రోడ్ల వెంట డంప్ చేస్తున్నారు. చర్యలు తీసుకోకపోవడంతో డంపింగ్ ఆందోళన కలిగించే రీతిలో పెరుగుతోంది.

స్పెషల్ డ్రైవ్

నిర్మాణ వ్యర్థాలు, చెత్త తొలగింపుపై వంద రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లోను నిర్మాణ వ్యర్థాల తొలగింపు పాక్షికంగానే కొనసాగిందని చెప్పవచ్చు. బ్రహ్మకుమారీస్ రోడ్డుతో పాటు గౌలిదొడ్డిలో విచ్చలవిడిగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. రాత్రి సమయంలో డంప్ చేసే వాహనాలను సీజ్ చేస్తేనే సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో ఈ అక్రమ డంపింగ్‌ను అడ్డుకోవాలని పలువురు అంటున్నారు.

ముగిసిన పైలెట్ ప్రాజెక్ట్

శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం పైలెట్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే నిర్మాణ వ్యర్థాలను భవనాల నుంచి నేరుగా రాంకీ సంస్థ ఫతుల్లాగూడ ప్లాంట్‌కు తరలించేది. ఆ సంస్థతో కుదుర్చుకున్న పైలెట్ ప్రాజెక్ట్ ముగిసింది. దీంతో ప్రస్తుతం రోడ్ల వెంట డంప్ చేసిన వ్యర్థాలను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందమైన రోడ్లు, చెరువులు డంప్‌యార్డులుగా మారుతున్నాయి. కోట్ల రూపాయలు పెట్టి నిర్మాణాలు చేపట్టే యజమానులు కొద్దిపాటి ఖర్చుతో వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్లకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులతో హిమాన్షు సందడి



గచ్చిబౌలి డివిజన్ కేశవ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల నడుమ హిమాన్షు



చిన్నారులతో కలిసి బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న హిమాన్షు



బ్యాగులను పంపిణీ చేస్తూ...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టింబర్ లేక్‌కాలనీ, కిమ్స్ ఆస్పత్రి, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మధురానగర్, ఓరియన్ విల్లాస్, రాయదుర్గం పోలీస్ స్టేషన్, రాయదుర్గం సిగ్నల్, బయోడైవర్సిటీ పార్క్ తదితర ప్రాతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లి: సుదర్శన్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సుదర్శన్‌నగర్, అలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

11 కేవీ డోయన్స్‌కాలనీ ఫీడర్ పరిధిలో...

11 కేవీ డోయన్స్‌కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు డోయన్స్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 120, పచ్చిమిర్చి 100, బెండ 50, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 65, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ భగ్గు



రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అనవసరం అంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం మండలంలోని ఇస్నాపూర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై రేవంత్‌రెడ్డి అహంకార తపూరితంగా వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ దిగజారుడుతనాన్ని సూచిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న విప్లవాత్మక సంస్కరణల కారణంగా ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బీఆర్‌ఎస్ పార్టీని ఎదుర్కొనలేక విలువలు లేని రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ పల్లెలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతీ గ్రామం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్ రెడ్డి, సర్పంచ్ ఉపేందర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ప్రజలకు పరిపాలన మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా చిన్న గ్రామ పంచాయతీలు, చిన్న మండలాలను ఏర్పాటు చేశారన్నారు. గత పాలకుల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామ పంచాయతీలకు పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతీనెల నిధులు అందజేస్తూ సరికొత్త విప్లవానికి నాంది పలికారన్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధిలో ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు సుష్మా శ్రీ, దేవానందం, జెడ్పీటీసీలు సుప్రజా వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, తదిరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



అశోక్‌వర్ధన్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేసిన సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి బ్యాచ్‌మేట్లు ఆర్థిక సహాయం అందించారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మృతుని కుటుంబసభ్యులకు బుధవారం చెక్కు అందించారు. ఆర్‌జీఐఏ ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్‌వర్ధన్ అనారోగ్యంతో జూన్ 21న మృతి చెందాడు. దీంతో తోటి 2000 బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లు ఉమ్మడి రంగారెడ్డిజిల్లా బ్యాచ్ (సైబరాబాద్, రాచకొండ, నిజామాబాద్) తమ వంతుగా రూ.2.45 లక్షలను సేకరించి అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్తయ్య, వెంకటేష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ భద్రారెడ్డి, కోశాధికారి జి మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె కరుణాకర్‌రెడ్డి, జి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గీతం స్కాలర్‌కు పీహెచ్‌డీ



హసీనా

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థిని ఎం.హసీనాను డాక్టరేట్ వరించింది. 'న్యూరో ట్రాన్స్‌మీటర్, దాని ముందున్న ఎలక్ట్రోకెమికల్ గుర్తింపు కోసం సల్ఫెడ్ క్వాంటం డాట్స్ మద్దతుతో రూపకల్పన సంశ్లేషణ, ఆనవాలు లక్షణ చిత్రణ' అంశంపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని ఆమె సమర్పించారు. పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నమాల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. దీనిపై గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేష్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

హఫీజ్‌పేట్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ గ్రామానికి చెందిన గంట్లపత్ర రమేష్ (36) మేస్త్రీ. ఇతనికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు రమేష్ పని నిమిత్తం అనిల్ అనే వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై గౌలిదొడ్డికి వెళ్తుండగా మార్గమధ్యలో గోపన్‌పల్లితండా వద్ద వజ్రా అపార్ట్‌మెంట్స్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలు కాగా, అనిల్‌కు కూడా తలకు, కాలుకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో మృతుడు రమేష్ భార్య రజని, కొడుకు లలిత్ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముత్తంగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలాలు కాపాడండి

మియాపూర్: దీప్తిశ్రీనగర్ కాలనీలోని పార్కు స్థలాలను కాపాడాలని ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో పార్కు, ఎమినిటీస్ స్థలాలను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారంటూ బుధవారం కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు ఆ స్థలం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ దీప్తిశ్రీనగర్ కాలనీలో 10 పార్కు స్థలాలు ఉండగా అందులో ఓ పార్కు అభివృద్ధి చెందగా మిగతా స్థలాలన్నీ ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో రేగులకుంట చెరువుపై భాగంలో 2000 వేల చదరపు గజాలలో ఓ పార్కు విస్తరించి ఉంది. పార్కు ప్రక్కనే 5,270 చదరపు గజాలలో ఎమినిటీస్ స్థలం ఉంది. గతంలో ఈ స్థలంను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారని, దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోందని.. ఐనా కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారని ,అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

నేడు ఆండర్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

బంజారాహిల్స్: ఈ నెల 13వ తేదీన ఆదిత్య పార్క్ హోటల్‌లో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలో ఒక్కటైనా ఆండర్సన్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం నిర్వహిస్తున్నదని సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఇవాన్స్ వైటేకర్, డాక్టర్ బెంజిమెన్ బ్రామర్, డాక్టర్ అనిల్ పల్లా వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఐటీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులకు ఈ యూనివర్సిటీలలో తక్షణ ప్రవేశాలు ఇవ్వనున్నామని, ఔత్సాహికులు ఫోన్: 63871 49133లో సంప్రదించవచ్చని తెలిపారు. హాజరైన ప్రతినిధులతో మాట్లాడి అవసరమైన ఐ20 డాక్యుమెంట్లను పొందాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఆండర్సన్ విశ్వ విద్యాలయం, యూనివర్సిటీ హబ్ మధ్య సహకారం ఉండటంతో విద్యార్థుల ప్రయోజనం కోసం ఈ ప్రక్రియను సులభతరం చేస్తున్నామన్నారు.

మనూలో జాతీయ సెమినార్

రాయదుర్గం: గంగా–జమునా తహజీబ్ ప్రోత్సహించడంలో ఉన్నత విద్యా సంస్థలు ముఖ్య పాత్ర పోషించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో గంగా–జమునా తహజీబ్‌పై ఒక రోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూస్థాన్ అందమైన వధువులాంటిందని, హిందువులు, ముస్లీంలు దాని రెండు కళ్ళ లాంటివారన్నారు. ఎస్ఈ అండ్ టీ అండ్ సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ సిద్ధిఖీ మహ్మద్ భారతీయ సంస్కృతి యొక్క విశిష్ఠత వివరించారు.కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎంవి రామ్‌కుమార్, రత్నం, జేవి మధుసూదన్, డాక్టర్ శామ్యూల్, ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, ఎం వనజ, గుల్ఫిషన్ హబీబ్, డాక్టర్ సయ్యద్ మహమూద్ కజీ ప్రసంగించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు

వైద్యం వికటించి మహిళ మృతి

హఫీజ్‌పేట్ : వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందింది. చందానగర్ పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం వివరాలు... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరిలాల్ కుటుంబం శేరిలింగంపల్లిలోని ఓ కనస్ట్రక్షన్ సంస్థలో కూలి పనులు చేసుకోవడానికి నెలన్నర క్రితం వచ్చింది. ఆ సంస్థలోని గుడిసెలలో నివాసముంటున్నారు. హరిలాల్ భార్య కుసుం (55) రెండు రోజుల క్రితం నుంచి జలుబు, జ్వరంతో బాధపడింది. బుధవారం ఉదయం 11.30 గంటలకు గుల్‌మోహర్ పార్కు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఉన్న ఓ ఆర్‌ఎంపీ వద్దకు కుసుం చికిత్స కోసం వచ్చింది. చికిత్సలో భాగంగా ఆమెకు జ్వరానికి సంబంధించిన ఇంజక్షన్ వేశాడు. కొద్దిసేపటికే కుసుం ఒక్కసారిగా క్లినిక్ వద్దనే కుప్పకూలిపోయింది. వైద్యుడు పరిశీలించి చూడగా ఆమె మృతి చెందినట్లు తెలుసుకొని క్లినిక్ మూసివేసి వెళ్లిపోయాడు. వెంటనే మృతురాలి కుటుంబ సభ్యులు క్లినిక్ వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వైద్యుడి నిర్లక్ష్యం వల్లనే మహిళ మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. కుసుంకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో కూడా వైద్యుడి నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్లినిక్‌కు తాళం....

శేరిలింగంపల్లి గుల్‌మోహర్ పార్కు వద్ద ఉన్న శ్రీ సాయి క్లినిక్‌కు రంగారెడ్డి డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు ఆదేశాల మేరకు తాళాలు వేసి, పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించారు. శేరిలింగంపల్లి పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ స్వామి క్లినిక్‌కు వెళ్లేసరికి ఆర్‌ఎంపీ తాళం వేసుకొని వెళ్లిపోయాడు. రెండు రోజుల్లో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన తెలిపారు.